క్లుప్తంగా

ధ్యానంతో మానసిక బలం



పిరమిడ్ మాస్టర్ ప్రసాదరావును సన్మానిస్తున్న ధ్యానులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధ్యానంతో మానసిక బలం పెరుగుతుందని, ప్రతీ వ్యక్తి తన వయసు ఎంతో అన్ని నిమిషాలు ధ్యానం చేయాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎర్నేని ప్రసాదరావు తెలిపారు. నగరానికి చెందిన పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడులో ధ్యానం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాసమీద ధ్యాస అని, మనలోని అన్ని ఆలోచనలను వీడి శ్వాసమీదే దృష్టి కేంద్రీకరించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్లను ఎదుర్కొనే అత్యద్భుత ఆయుధం ధ్యానం అన్నారు. ఈ సందర్భంగా ధ్యానులు ప్రసాద రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజేటి శేషగిరి రావు, కూర్మాల లక్ష్మి, కొల్లి త్రినాథ్, కొండాల మౌర్య తదితరులు పాల్గొన్నారు.

రహదారులన్నీ అభివృద్ధి చేశాం

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహాయ సహకారాలతో దెందులూరు నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి చేశామని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎక్కడ రోడ్లు వేయించారో ప్రజలు తెలుసునని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దెందులూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి అజెండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యాలుగా పనిచేస్తోందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం రోడ్డు, ఏలూరు, చింతలపూడి రోడ్డు రూ. 29 కోట్లు, ఏలూరు, కైకలూరు రూ. 55 కోట్లు, పెదపాడు, పెరికిడు రూ.27 కోట్లు, దెందులూరు, పంగిడిగూడెం, కొప్పాక, వట్లూరు, విజయరాయి, పెదవేగి, వంగూరు, కవ్వగుంట, జానంపేట, 7వ మైలు, తాళ్లగోకవరం, బాదరాల, రామశింగవరం, గోపన్నపాలెం, రామశింగవరం రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో ఉండే ప్రజలకు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు రోడ్లు వేశారో తెలుసునని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. వాస్తవానికి రోడ్ల నిర్మాణ పనులు దెందులూరు నియోజకవర్గంలో ఇలా ఉంటే.... వాటిని ప్రస్తావించకుండా నియోజకవర్గంలో రోడ్లు బాగాలేదంటూ ఎల్లో మీడియా, టీడీపీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. మరోసారి దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని ఎమ్మెల్యేగా తన విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గడపగడపలో ప్రజావినతులపై ప్రత్యేక శ్రద్ధ
- 31, 32 డివిజన్లలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు
- క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం
- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని



వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆళ్లనాని, చిత్రంలో డిప్యూటీ మేయర్లు, కమిషనర్, తదితరులు



సమీక్ష సమావేశానికి హాజరైన రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, నగరపాలక సంస్థ, సచివాలయ సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన రీతిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, ముఖ్యంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో 31, 32 డివిజన్లలో గడపగడపకూ కార్యక్రమంలో ప్రజల వినతులపై, అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై అధికారులతో సమీక్షించారు. ఆదివారం ఉదయం చేపట్టిన సమీక్ష సమావేశానికి ఏలూరు నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని మాట్లాడుతూ ఏలూరు నగరంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి స్థానికంగా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తి వినతినీ పరిగణనలోకి తీసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. డివిజన్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, ప్రజల కోరిక మేరకు ప్రజల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

ఏలూరు నగరంలోని 31వ డివిజన్ కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్, 32వ డివిజన్ కార్పొరేటర్ బండారు రత్నకుమారి, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్లనాని పర్యటనలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఒక కార్యాచరణ ప్రణాళికను అధికారులు రూపొందించారు. రెండు డివిజన్ల పరిధిలో సుమారుగా రూ.50లక్షలకు పైగా అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా ఎమ్మెల్యే ఆళ్లనాని వాటిని ఆమోదించి, వెంటనే చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు 31వ డివిజన్‌లో తమ్మిలేరు ఏటిగట్టు ప్రాంతంలో రూ.3.20 లక్షలతో రెండు సీసీ డ్రెయిన్లు, తమ్మిలేరు రివిట్‌మెంట్ వాల్‌కు రూ.3 లక్షలతో ఇరిగేషన్ షట్టర్ ఏర్పాటు, అశోకవర్ధన్ నగరపాలక స్కూల్ ముందు, పక్కన రూ.4.50 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణం, కేపీడీటీ జూనియర్ కాలేజీ ఎదురుగా రూ.4.97లక్షలతో సీసీ డ్రెయిన్, అశోక్ పిల్లర్ నుంచి అమీనాపేట రోడ్డు వైపు రూ.9.81 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు ఆమోదించారు. ఏలూరు 32వ డివిజన్‌లో సుమారు రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు చేయటంతో పాటు, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్లనాని ఆమోదం తెలిపారు. కనకదుర్గ గుడి రోడ్డు సమీపంలో రూ.3.5 లక్షలతో డ్రెయిన్, ఆంజనేయుని గుడి ప్రాంతంలో రూ.4.5లక్షలతో సీసీ డ్రెయిన్, అమలోద్భవి స్కూల్ ఏటిగట్టు ప్రాంతంలో రూ.2 లక్షలతో సీసీ డ్రెయిన్, రెయిలింగ్, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయించారు. అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద రాత్రి వేళలో చిరువ్యాపారులు, కొబ్బరి బొండాలు విక్రయించేవారు తమ్మిలేరులోకి వ్యర్థాలను పారవేస్తోన్న నేపథ్యంలో ఇడా నిధులతో సుందరీకరణలో భాగంగా కేజ్ ఏర్పాటు, తమ్మిలేరు ఏటిగట్టు రివిట్‌మెంట్‌కు డ్రెయినేజీ నీరు పోయేందుకు ప్రత్యేకంగా షట్టర్ల ఏర్పాటుపై ఎమ్మెల్యే నాని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సమీక్షలో ఏలూరు నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, ఎన్జీవో నాయకులు చోడగిరి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మంచెం మైబాబు, పీవో కృష్ణమూర్తి, డీఈలు వంగపండు సత్యనారాయణ, తాతబ్బాయ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ముగిసిన గంగానమ్మ సంబరాలు

ఏలూరు రూరల్: శనివారపుపేట శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డు గంగానమ్మ సంబరాలు ఆదివారం ముగిసాయి. అర్చకులు ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొదటరోజు 108 బిందెల నీళ్లలో అమ్మవారి అభిషేకం, ఘటాల ఊరేగింపుతో పాటు విశేష పూజలు నిర్వహించారు. రెండోరోజు చేపట్టిన అమ్మవారి అష్టదిగ్బంధన, గణపతి పూజ, పంచగవ్యప్రాశన, మండపారాధన చేసారు. సాయంత్రం జలవాసం, ధాన్యవాసంతో పాటు సామూహిక కుంకుమ పూజ, 3వ తేదీ జరిగిన శాంతి హోమం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తంగా 11వ ఏట నాలుగురోజుల పాటు నిర్వహించిన సంబరాలు వైభవంగా జరిగాయని సభ్యులు ఆళ్ల మోహనరావు తదితరులు చెప్పారు.

పేకాట, కోడిపందేలపై దాడి

పెదవేగి : రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట, కోడిపందేల స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేశారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పాకలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఘటనా ప్రదేశంలో నలుగురు వ్యక్తులు వారి వద్ద నుంచి రూ. 2,950 నగదు, 4 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. అనంతరం కూచింపూడిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఇద్దరి నుంచి రూ.2,400 నగదు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ
- ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు



ఏలూరు రూరల్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, చిత్రంలో సీఐ ఆదిప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకే పెద్దపీట వేస్తామని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు, పెండింగ్ కేసులు, దర్యాప్తు తదితర విషయాలపై ఆరా తీశారు. రూరల్ స్టేషన్ ఆవరణలోని ఆయా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా, మర్యాదగా నడచుకోవాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రజలకు రక్షణ నిలవటంతోపాటు, శాంతిభద్రతలను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సూచించారు. ఆయా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, కేసుల దర్యాప్తు, కోర్టుల్లో ఛార్జిషీటు దాఖలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. నిందితుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు ఉండాలని డీఎస్పీ సూచించారు. ఈ తనిఖీల్లో ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు ఉన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

పెదవేగి : వేసవిలో విద్యార్థులకు ప్రభుత్వం చక్కటి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు వేసవి శిక్షణ తరగతులను ఏర్పాటు చేసిందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజలకు 'ఆరోగ్య భరోసా '



ఏలూరు చాణక్యపురి కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ పీహెచ్‌సీ భవనం



ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం

- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు
- ఇంటి సమీపంలోనే వైద్య సేవలు లక్ష్యం

ఏలూరు టౌన్: గతంలో పేదోడికి రోగమొస్తే దిక్కుతోచని దీనస్థితి. కార్పొరేట్ హాస్పిటల్ వైపు కన్నెత్తి చూడలేని దారుణమైన దైన్యస్థితిలో కొట్టుమిట్టాడుతుండేవారు. అనంతరం దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ చరిత్రను తిరగరాస్తూ ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు ఉచిత వైద్యాన్ని చేరువచేశారు. 108, 104 వాహనాల ద్వారా మెరుగైన రీతిలో వైద్యం అందించేందుకు మార్గం సుగమం చేశారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదవర్గాల ప్రజలకు ఆరోగ్య భరోసా వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఐదంచెలు, పట్టణ ప్రాంతాల్లో మూడంచెల విధానానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో 104 సంచార వైద్యశాల, ఫ్యామిలీ డాక్టర్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా హాస్పిటల్‌లో సేవలు. ఇక పట్టణాల్లో చూస్తే అర్బన్ పీహెచ్‌సీ, 104 సేవలు, జిల్లా హాస్పిటల్‌లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

పేదలకు అండగా ప్రభుత్వం

ఏలూరు నగరంలో పేదలకు ఆరోగ్య భరోసా కలిగించేందుకు ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజారోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. చిన్నపాటి అనారోగ్యానికి ప్రైవేటు హాస్పిటల్స్‌కు పరుగెత్తే అవసరం లేకుండా ఇంటి సమీపంలోనే వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. ఏలూరు నియోజకవర్గంలోని రూరల్ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను, అర్బన్ ఏరియాల్లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ పీహెచ్‌సీల్లో వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటికే ఏలూరు నగరంలో యూపీహెచ్‌సీలు ఉండగా.. వాటికి అదనంగా పేదవర్గాలకు మరో 7 డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీల నిర్మాణాలు చేపడుతున్నారు. రూరల్ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో ఒక వైద్యుడు, ఆరోగ్య సిబ్బంది, డీఈవో, పరీక్షలు చేసేందుకు సిబ్బంది, ఉచితంగా మందులు అందుబాటులో ఉంచారు. ఏలూరు చాణక్యపురి కాలనీలో ఇటీవల ఆయుష్మాన్ భారత్ నిధులతో డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ నిర్మాణం చేపట్టి, ఎమ్మెల్యే ఆళ్లనాని చేతులమీదుగా ప్రారంభించారు. శ్రీరామ్‌నగర్‌లోనూ డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను నిర్మించి, ప్రారంభించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు



ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ప్రత్యేక శ్రద్ధతో ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన రీతిలో వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. ఏలూరు జిల్లా కేంద్రంలో ప్రజల చిరకాల కోరిక ప్రభుత్వ మెడికల్ కళాశాల సాధించి, నిర్మాణం చేపట్టారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, పేదలు అనారోగ్యం బారిన పడితే తామున్నామని అండగా నిలుస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం .

– ప్రత్తిపాటి తంబి, హైకోర్టు న్యాయవాది, ఏలూరు

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేసే బాధ్యతను ఎమ్మెల్యే ఆళ్ల నాని తీసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్యరంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఏలూరు నగరంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీలు కొన్ని నిర్మాణాలు పూర్తి చేశాం. కొన్ని ప్రగతిలో ఉన్నాయి. పేదలు వైద్య కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకుంది.

– డాక్టర్ దిరిశాల వరప్రసాద్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	52
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07-10
బెండకాయలు	32	కంద	54
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	--	అల్లం	220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	36

అందుబాటులో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నట్లు ఏఓ బి. సుమలత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర విత్త నాలు 280 క్వింటాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న గారపాటి చౌదరి

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఏలూరు కోటదిబ్బ ప్రాంతంలోని నేరెళ్ళ రాజా కల్యాణ మండపంలో సోషల్ మీడియా ప్రభావితం చేసే వ్యక్తుల ప్రత్యేక సమావేశం ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దేశంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోదావరి జోనల్ సోషల్ మీడియా కన్వీనర్ గాదిరాజు రామరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొరళ్ళ సుధాకర్ కృష్ణ, బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తోట వరప్రసాద్, కోటప్రోలు కృష్ణ పాల్గొన్నారు.

ఏలూరు చేరుకున్న తిరుమల పాదయాత్రికులు



ఏలూరు చేరుకున్న భోగి గణపతి పీఠం ప్రతినిధి రమణ రాజు, గోవింద స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాకినాడకు చెందిన శ్రీ భోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణ రాజు ఆధ్వర్యంలో కాకినాడ నుంచి తిరుమల వరకూ చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఏలూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా రమణ రాజు మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో భోగి మంటల్లో వెలసిన స్వయంభూ భోగి గణపతి విగ్రహానికి సంపూర్ణ కాంస్య కవచ ధారణ యజ్ఞం చేపట్టామన్నారు. ఈ యజ్ఞం విజయవంతంగా పూర్తి కావాలనే ఆశయంతో తిరుమలకు 41 రోజుల పాదయాత్ర చేపట్టామన్నారు. ఈ యాత్ర అనంతరం కాకినాడ భోగిగణపతి పీఠంలో 9 రోజుల పాటు నిత్య అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. రమణరాజు వెంట గోవిందస్వామి యాత్రలో పాల్గొంటున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	22
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	27
ఏలూరు -తిరుపతి	16.00	4830	36

వైభవంగా మార్కండేయ స్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో విశేష అలంకరణలో మార్కండేయ స్వామి ఉత్సవ మూర్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దక్షిణపు వీధిలోని మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. నిత్య హోమం బలిహరణ, అనంతరం ఆలయంలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ముగిసిన విశ్వేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం..

స్థానిక పవర్ పేటలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఆదివారంనాటితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో ఉదయం వసంతోత్సవం, కొట్నాలు, చూర్ణోత్సవం, త్రిశూల స్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి స్వామి వారికి శ్రీ పుష్ప శయనోత్సవం (పవళింపే సేవ) నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి రామబ్రహ్మానంద శర్మ విశేష పూజలు చేయగా కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పుంత రోడ్డు అభివృద్ధి

పెదపాడు: రైతులకు ప్రయాణికుల సౌకర్యార్థం వసంతవాడ నుంచి అప్పనవీడు వద్ద జాతీయ రహదారిని కలిపేందుకు నూతనంగా పుంత రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ తెలిపారు. ఆదివారం వసంతవాడ నుంచి అప్పనవీడు వరకు నిర్మిస్తున్న పుంత రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఎవరికీ పుంతరోడ్డుపై అవగాహన లేదని రైతులు తమ సరిహద్దులో ఉన్న పుంత స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారని అన్నారు. జాతీయ రహదారి ఏర్పడిన తర్వాత గ్రామానికి అతి చేరువగా ఉండటంతో ఈ రహదారి అభివృద్ధి చేస్తే సమీప రైతులకు, గోగుంట, రాజుపేట, వసంతవాడ గ్రామాల ప్రజలు హనుమాన్ జంక్షన్ వెళ్లేందుకు, జాతీయ రహదారిని చేరుకునేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. రైతులను ఒప్పించి తొలుత మట్టితో మెరక చేసి గ్రావెల్ రహదారి నిర్మిస్తున్నామన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏఎంసీ ఛైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు వసంతవాడ, అప్పనవీడు సర్పంచ్‌లు చింతల రమాభారతి, చిన్నాల ఝాన్సీ ఈ రహదారి అభివృద్ధికి సహకారం అందించారని తెలిపారు.